ధర్మ సందేహం

కొడవటిగంటి కుటుంబరావు

ప్రమాణపూర్తిగా ఇంతకన్నా ఏమీ జరగలేదు.

"కాస్త ఫలహారం చేద్దువుగాని లేవరా!" అని వాళ్లమ్మ అంటూనే వుంది. ఏదో ఆలోచిస్తూ పడుకున్న వాడల్లా చివాలున లేచాడు, కోటు వేసుకున్నాడు. బయటవున్న తన పుస్తకాలూ, కాగితాలూ, కలమూ, రెండు చొక్కాలూ, తువాలూ, గబగబా పెట్టెలో అడ్డదిడ్డంగా పడేసి పెట్టె మూసేశాడు. కాళ్లకు చెప్పులు తగిలించుకున్నాడు. పెట్టె చేతపట్టుకున్నాడు. "నే పోతున్నా" అన్నాడు.

ఎక్కడికిరా, అంటే చెప్పలేదు. ఎందుకురా, అంటే చెప్పలేదు.

శివయ్యకు కోపం వచ్చింది. రాదూ? అడ్డంవెళ్లి "నీ వేషాలు—నా కెప్పుడూ అర్థం కాలేదనుకో—ఇప్పుడసలే అర్థం కావటంలేదు." అని పలకరించబోయాడు.

"నా దారికి అడ్డంలే" అన్నాడు జానకిరాముడు.

అంతే వెళ్లిపోయినాడు. మళ్ళీ తిరిగి రాలేదు. తిరిగి వచ్చేవాడైతే, అట్లా దేనికి వెళతాడూ ?

చేతికొచ్చిన కొడుకు. లా చదవక పోతేమానె, ప్రాక్టీసు పెట్టకపోతే మానె, బియ్యే చదివాడుగా ? నాలుగురాళ్లు తెచ్చుకోగల సమర్థత ఉన్నవాడేగా ?

తనకోసం కాకపోతేమానె — పెళ్లాం, పెటాకులా ? నిక్షేపమల్లే వాడి ఈడు వాళ్ళంతా బిడ్డలతండ్రులై కూర్చు న్నారు! తండ్రికోసమయినా ఒక ఉద్యోగమంటూ అఘోరించి, పుత్ర ధర్మంగానైనా, తండ్రిమీది బరువు తగ్గించినవాడు కావచ్చుగా !

తన తండ్రి ప్లీడరుగుమస్తాగిరీ చేసి కాపరం గడుపుతున్నాడంటే తనకు మాత్రం ఏం ఘనం ?

అన్నిటికీ ఏదో ఒకటి చెబుతాడు. ఉద్యోగాలు ఎక్కడ వున్నయ్యంటాడు శివయ్య మూడోఫారం పాసుకాలా. ఏడాది వాలంటీరుచేసి అయిదురూపాయల మీద ప్లీడరుగుమస్తా అయినాడు. జానకి రాముడి పుటకలప్పటిమాట ! మరి ఆ చేత్తోనే ముప్పయివేలు చేసే ఆస్తి సంపాదించాడా? డబ్బు మనదగ్గరికి ఎప్పుడన్నా వస్తుందా ? మనమే దాని దగ్గరికి వెళ్ళాలిగాని !

అయినా వాడికి పుత్రధర్మమేమిటి ? నాస్తికుడైతే. తద్దినాలేమిటంటాడు ? కొలువులేమి టంటాడు ? పూజలేమి టంటాడు. జాతకాలేమిటంటాడు? "వీరేశ లింగంగారు చచ్చిన ఇన్నేళ్ళకి నా చుట్టూతా ఈ మూఢాచారాలేమిటి" అంటాడు. దొరికాడు వెధవముండల పెళ్ళిళ్ళ పంతులు—ప్రతిదానికీ మూఢా చారమే ? పనిమీద పొయ్యేవాడు, ఒంటి బ్రాహ్మడెదురైనాడనో, తుమ్మారనో కూర్చుంటే, అది మూఢాచారమా ? పొద్దున్నే లేచింది లగాయతు ఎన్నో పాపాలు చేస్తాం, ఎన్నో అబద్ధాలాడతాం ఎంతమందికో టోపీ వేస్తాం, రాత్రికి పడుకోబొయ్యే సమయానికి కాస్త 'రామా కృష్ణా' అనుకుంటే, దానమ్మ కడుపు కాలా, అదీ మహాపాతకమేనా? ఇదేనా చదువుసంధ్యలు నేర్పేది?...

2

శివయ్యకు నిజంగా పట్టుకున్నది ఇదేదీకాదు. జానకిరాముడిల్లు వదిలి ఎందుకు పోయినట్టు ?

ఒక పోట్లాట జరగలేదు; వాగ్వాద మన్నా జరగలేదు.

వాడికేవేవో మనస్సులో వున్న మాట నిజమే — కాని, అవి ఈ నాటివి కావుగా !

అసలు, వాడికి ఆ యింటిమీదే పగ.

"కట్టారు ఇల్లు. ప్రతి దర్వాజాలో నుంచి వొంగిపోవలసిందే ! మరో ఆరేసి అంగుళాలు పెట్టుకుంటే ఏం పోయింది ? ఇల్లు మొత్తంమీద ఈ పొట్టి గుమ్మాలు

పెట్టి పదిరూపాయలన్నా ఆదా చేశారో లేదో—పాపం!"—అని సణిగేవాడు.

తను చెమటోడ్చి ఒక్కొక్క రూపాయే కూడబెట్టి పోగుచేసి ఎన్నో ఏళ్ళ ప్రయత్నంతో ముచ్చటపడి కట్టించిన ఈ ఇంటికి, దర్వాజాలు మరో అంగుళం పెట్టలేదని, రోజూ తనకొడుకు సణుగుతూవుంటే శివయ్యగారి ప్రాణం ఎంత క్షోభపడాలి? క్షోభపడాలా? వీడు ఆరడుగులు పెరుగుతాడని ఆ యిల్లు కట్టినవారెవరన్నా కలగన్నారా... ?

అదేం ఖర్మమో, ఆ తండ్రి కొడుకులిద్దరికీ ప్రతిదాన్లోనూ ఎదురుమళ్ళే. శివయ్యగారు ఎంత సదుద్దేశంతో ఏది చెప్పినా, జానకి రాముడు దానికొక దురుద్దేశం అంటగడతాడాయె.

"నీ జన్మల్లా ప్లీడరుగుమస్తాగిరీలో గడిచింది. ప్లీడరుపని చెయ్యాలనే నీ మోజు నా ద్వారా తప్ప తీర్చుకునేటందుకు లేదు. అందుచేత నన్ను ప్లీడరుకమ్మంటున్నావు ... అవును, ప్లీడర్లకి ఏమీ రావటంలేదని నీకు తెలుసు. నీ ప్లీడరుగారు—సంపాదించింది నీ తెలివితేటలవలననే అని నమ్మకం. నీతోడుంటే నేను లక్షలు సంపాదిస్తానని నీ ఆశ! నిజంగా నీ మూలంగానే మీ ప్లీడరుగారు వేలకువేలు సంపాదిస్తే నువ్వాయనదగ్గిర నలభై రూపాయలతో ఎందుకు తృప్తి పడ్డావు ? నీ అసలు సంపాదనంతా క్లయింట్లను దోచి ఎందుకు సంపాదించావు?"

ఏమిటీ మాటలు ? మాటా, మర్యాదా తెలిసినవాడు అనేవేనా ?

అసలు వాడికి పెద్దంతరం, చిన్నంతరమంటూ ఉందా ?

"రోజూ పాపాలు చేస్తున్నామని తెలిసుండి ఆ పాపాలు చెయ్యకపోతే ఏం?" అని వాడు తండ్రిని అడగలా?

3

"వాడెందుకు వెళ్లినట్టు ?"

ఈ ప్రశ్నకి సమాధానం దొరక్కపోవటం శివయ్యగారికి వింతగా వుంది.

వెడితే, వెళ్లాడు. బలవంతాన ఇంట్లో ఉంచుతారా ఏమిటి, పాతికేళ్ల పైబడ్డ వాణ్ని?

వాడు జంఝం లాగిపారెయ్యటం ఈ ఇంట్లోనే అయిపోయింది. తనను అనవలసిన మాటలన్నీ అనటం అయిపోయింది. "నీసంపాదనలోనుంచి నాకొక్క దమ్మిడీ అక్కర్లేదనటం అయింది. చాలాకాలం కిందటే అచ్చుపోసి, విడిచేశారు. ఇప్పుడకస్మాత్తుగా ఏమి వచ్చిందని లేచి పోయినట్టు ?

రోజూ భోజనంవేళకు ఇంటికివస్తాడు. ఎక్కడికో వెడతాడు. ఎవరెవరో వచ్చి పిలుచుకుపోతారు. ఏవేమి విషయాలో మాట్లాడతారు. ఇహానికీ పరానికీ చెందిన విషయాలుకావు. ఒక డబ్బు విషయం కాదు. ఒక కోర్టు వ్యవహారంకాదు. ఒక

కుటుంబవ్యవహారం కాదు. ఎవరూ లేకుండా ఇంటోకూచుని ఏదో రాస్తాడు బ్రహ్మరాత. అదంతా పత్రికలకి పంపిస్తాడు గామాలు. చిన్నవాడప్పుడప్పుడూ "నాన్నా, అన్నయ్య రాసింది అచ్చుపడ్డది చూశావా?'' అంటాడు.

ఏముంటుంది చూడటానికి? బూడిద! వీరేశలింగమని వుంటుంది! జంఝాలు తెంచమని వుంటుంది! అన్నమంతా పట్టి చూడాలీ! అబ్బాయి వాలకం అర్థమవుతూనే వుందిగా!

ఇదంతా జరిగిపోతూనే వుందిగా! ఇప్పుడు వీడెందుకు ఇల్లు విడిచి, దిక్కులేని పక్షి అయి, వెళ్ళిపోవాలి...?

శివయ్యగారు తనమీద దోషారోపణ చేసుకోవలసిన అవసరం ఏమీలేదు, కాని కొడుకు లేచిపోవటానికి తప్పు తనదే అని ఎవరో అన్నట్లుగా ఆయన బాధపడ్డాడు. వాడు "నీ మూలంగానే నేను ఈ కొంపలోంచి బయటికి పోతున్నా" అంటే ఎంత గింజుకోవాలో అంతగా ఆయన మనస్సు గింజుకుంటున్నది.

ఆ కారణం తెలిస్తే బాగుండును. అప్పుడుగాని ఈ గింజాటన అంతం కాదు. ఆ కారణం కోసం ఆయన మనస్సు ఆనాటి—జానకిరాముడు వెళ్ళిపోయిననాటి — సంఘటనని సినిమా చిత్రం మళ్ళీ మళ్ళీ వేసి చూసుకున్నట్టు చూసుకుంటున్నది.

వెనక ఒకసారి— పదేళ్ళక్రితం— చిన్న సంఘటన జరిగింది. శివయ్యగారు బజార్లో అయిదురూపాయల కాగితం పారేసుకున్నాడు. అది పోయిందని చూసుకున్నచోట రోడ్డు ఝాముసేపు వెతికాడు కాగితం దొరకలేదు. ఆయనే కాదు. ఇంకా యాభై మంది కలిసి వెతికారు.

"ఇంకెక్కడన్నా పారేసుకున్నారేమో!" అని ప్రతివెధవా అనేవాడే చివరికి ఆయనికి కోపంకూడా వచ్చింది.

"ఇంతవరకూ చేతిలోనే వుంది. ఇప్పుడే పోయింది, ఇక్కడే చూసుకున్నా!" అంటాడాయన.

కాగితం పోయిందని రూఢి అయినాక ఆయనకు, వట్టి పుణ్యానికి ఐదురూపాయలు పోయాయన్న విచారంకన్న, తన పెద్దకొడుకు— అంటే ఈ జానకిరాముడే ఆ పొద్దునే తనను ఐదురూపాయలడిగి లేదంటే లేదనిపించినందుకు కోపం ఎత్తుకొచ్చింది. ఆ వెధవ తనచేత అన్నిసార్లు అయిదురూపాయలు లేదనిపించకపోతే ఈ కాగితమ్ముక్క పోకపోను... వెధవ తథాస్తుదేవతలు!...

అట్లాగే ఇప్పుడు...

ఈ విషయం ఎందుకు చెప్పొచ్చానో మరిచాను. పోనివ్వండి...

4

రెండోవాడున్నాడే— సూర్యం-వీడు వాడిమాదిరే కాదు. అసలు మొదటినుంచీ వీడితరహాయే వేరు. వీడిదగ్గిర దాపరికం

లేదు. స్పష్టంగా మనసులో వున్నది చెప్పేస్తాడు.

"ఇదుగో, నాన్నా! నువ్వు నన్ను లా చదవమంటున్నావు. నువు చెప్పినట్టు వినటం నా ధర్మం. నేను చదువుతాను. నాకేమీ అభ్యంతరం లేదు నీ ముచ్చట తీర్చటంకంటె నాకుకావలసిందేమిటి? కాని నేను ప్రాక్టీసు చేసి పైకొచ్చి ఫలానావాడి పిల్లవాణ్ని అనిపించుకోగలనని నాకు నమ్మకం లేదు. నువు ప్లీడరుగుమస్తా చేశావంటే, మీ ప్లీడరుగరికి వున్నంత పేరు నీకూ ఉంది. ఆయన సంపాదించి నంతా నువూ సంపాదించావు. రేపు నలుగురూ నన్నుచూసి, ఫలాని శివయ్యగారి కుర్రవాడేనా ఈ ప్రాక్టీసులేని ప్లీడరు, అంటే నీ మనస్సెట్లా ఉంటుందో ఆలోచించు. ప్లీడరీ చెయ్యడానికి కాస్త ఆరితేరినవాడై ఉండాలని నీకు తెలుసుకదా! నన్ను నలుగురిచేతా బుద్ధిమంతుడు అమాయకుడు అన్పించుకునేటట్టు పెంచావు. లాయరు పేచీలు నా వల్ల కావు... ఆలోచించు! నువుచదవమంటే లా చదివేస్తాను, ఫస్టుక్లాసులో కూడా పాసయిపోతాను. బి. ఏ. పాసైనవాడికి లా ఒక లెఖ్ఖా?" అని స్పష్టంగా చెప్పేశాడు.

నిజానికి వాడు చెప్పిందాన్లో అబద్ధం యేమీలేదు. పెళ్ళివిషయంలో కూడా వాడు అట్లాగే చెప్పేశాడు.

"ఇదుగో—నాన్నా! నాకు పెళ్ళి చేయాలనివుంటే మహారాజుగా చేసెయ్యి. కాని. ఇప్పుడు పెళ్ళిళ్ళు వెనకటిలాగా లేవు. ఈ శారదా బిల్లు వొచ్చేక పెద్ద పిల్లలై పెళ్ళాడుతున్నా రే, వీళ్ళు మొగుళ్ళని చూసుకుని ఇష్టపడటమూ, పడకపోవటమూ నేర్చుకుంటున్నారు. ఒకవేళ పెద్దవాళ్ళకి ఎదురాడక వాళ్ళు అంటగట్టిన మొగుణ్ని చేసుకుంటున్నా— లోపల వీణ్ణి నాకు అంటగట్టారే, అన్న పగ పెట్టుకుంటున్నారు ఇటువంటి పెళ్ళిళ్లు లేకుండానేఉండాలిగానీ, ఉన్నాక మొగుడూ, పెళ్ళాలూ ఒకరి మనస్సు లొకళ్లు తెలుసుకుని చేసుకోవటమే మంచిది. ఏమీ ఎరగనప్పుడు చేసేసిన మీ కాలపు పెళ్ళిళ్లే మేలు. అవి పోయాక ఎవళ్ళకి వాళ్ళు చూసుకునే సంబంధాలు నయంగాని ఈ మధ్యరకపు పెళ్ళిళ్ళు అందునా ఇందునా కాకుండా అఘోరిస్తాయి. నే చెప్పింది అవునంటావా? కాదంటావా?"

అందులో అబద్ధమేముందీ?

"ఎక్కడ చూసినా బియ్యేలే నాన్నా, రూపాయికి పదిమంది దొరుకుతున్నారు. ఏం ఉద్యోగం పోనిస్తూ? ఉద్యోగం లేకపోతే మనకేం జరగదు కనకనా? నాక్కూడా అన్నయ్యలాగే కథలు రాద్దామని ఉంది. నవలలు రాద్దామని ఉంది! రాస్తానుకూడాను. రెండు కథలు రాసి పత్రికలకి పంపా. పడతాయి. నువే

చూద్దువుగానిగా ? నే చెప్పేదీ, చాతయిన పని చెయ్యటంలోనే నిజమైన కీర్తి ఉంది, ఎందరు ప్లీడరుగుమాస్తా పనిచెయ్యలేదు. ఏదీ ? నీకొచ్చిన పేరందరికీ రాలేదేం ?" అన్నాడు సూర్యం.

5

నేనీమధ్య చుట్టపుచూపుగా శివయ్యగారింటికి వెళ్ళాను.

కుశలప్రశ్నలయినాక, మాటల సందర్భంలో ఆయనతో— "ఏం, బావగారూ ? పిల్లలిద్దర్నీ సాహిత్యం లో దించారే ?" అన్నా.

"వాళ్ళ మొహం !... నిన్ను చూసే చెడిపోయి వుంటారు... సరేకాని, మా సూర్యం ఏమన్నా బాగా రాస్తాడూ ?" అన్నాడాయన.

"బాగానే రాస్తాడు. ధోరణి ఉంది. కాని పెద్దవాడికి చాలదేమో. ఎక్కువ మందిని ఆకర్షించేవి చిన్నవాడి కథలే. కాని మీ జానకిరాముడు రాతలో లోతు జాస్తి అనిపించింది నాకు." అన్నాను.

"నేనివేవీ చదవనులే... అయినా నన్నడిగితే ఏ పనిలో కూడా, చూస్తున్నాగా, పెద్దవాడికన్న సూర్యానికే చాకచక్యం జాస్తి." అన్నాడు శివయ్యగారు.

అందామా, వద్దా అని కాస్సేపు పస్తాయించిఆఖరుకు అనేశా ;

"చూడండి, బావగారూ. మీరు చదవరు కనక మీకు తెలీదుగాని, మీ పిల్లలిద్దరూ మిమ్మల్ని కథల్లోకి ఎక్కించేశారు."

"నన్నే ? నన్నే ?" అన్నాడు శివయ్యగారు కంగారుగా.

"అవును. అదిగాదు నే చెప్పవచ్చింది. మీ సూర్యం మిమ్మల్ని చాలా అపహాస్యం పాలు చేసి కథ రాశాడు. మీ పెద్దవాడి కథలో—"

నామాట శివయ్య పూర్తికానివ్వలేదు.

"వాడెందుకు ఇల్లు వొదిలి వెళ్ళిపోయినాడో నాకర్థం గాలేదు, ఎంతో ఆలోచించా. ఇంటో వుంటే వాడికేమి నష్టం వచ్చింది ?"

"ఉంటే, వాడుకూడా మీ సూర్యం రాసినట్టే రాసేవాడేమో !" అన్నా. నాకింకేమీ అనటానికి తోచలా, చెప్పొద్దూ ?

శివయ్యగారు అర్థంకాని చూపులతో నాకేసి అట్లాగే చూశాడు.